పీహెచ్‌సీ వైద్యులు విధుల బహిష్కరణ

- రోగులకు ఇబ్బందులు
- 3 నుంచి సేవలు బంద్

నరసాపురం రూరల్: మెడికల్, పీజీ కోర్సుల్లో ప్రభుత్వ వైద్యులకు ఇన్‌సర్వీస్ కోటా కుదింపునకు వ్యతిరేకంగా, సమస్యల పరిష్కారం కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టడంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు ఎమర్జెన్సీ సేవలకే పరిమితమవుతున్నారు. ఓపీ సేవలకు దూరంగా ఉన్నారు. ఇదిలా ఉంటే నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామం, మొగల్తూరు మండలం మోడి గ్రామాల్లో సోమవారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాలకు వైద్యులు హాజరుకాకపోవడంతో రోగులు నిరాశతో వెనుదిరిగారు. గత జగన్‌మోహన్‌రెడ్డి సర్కారులో నిర్వహించిన వైద్య శిబిరాల్లో ఎంబీబీఎస్, ఎండీలతో పాటు వివిధ విభాగాల్లో ప్రత్యేక నైపుణ్యంగల ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు సైతం వచ్చి సేవలందించిన తీరును ఈ సందర్భంగా రోగులు గుర్తుచేసుకున్నారు. తూతూ మంత్రంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


మోడిలో ఎంఎల్‌హెచ్‌పీలతో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

నరసాపురం మండలం ఎల్బీచర్ల, తూర్పుతాళ్లు పీహెచ్‌సీలు, మొగల్తూరు మండలం మొగల్తూరు పీహెచ్‌సీల పరిధిలో దాదాపు 50 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుతాయి. వైద్యుల సేవలను గుర్తించని ప్రభుత్వం వీరికి ఇంక్రిమెంట్లు ఇవ్వడంలో మొండి చేయి చూపడం, ఈ ఏడాది పీజీ సీట్లను మళ్లీ 15 శాతానికి తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం, చంద్రన్న సంచార వైద్య చికిత్స కార్యక్రమం కింద వైద్యులకు రూ.5 వేలు అలవెన్సు తదితర డిమాండ్ల సాధన కోసం పీహెచ్‌సి వైద్యులు సమ్మెకు దిగారు. వాతావరణ మార్పుల కారణంగా గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వైద్య సేవలు అందక వారు ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం ఎల్బీచర్ల, మొగల్తూరు పీహెచ్‌సీలకు వచ్చిన డెలివరీ కేసులు, అత్యవసర కేసులను వైద్యులు పరీక్షించి సేవలందించారు. కొందరిని ఏరియా ఆసుపత్రికి నరసాపురం పంపించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి పూర్తిగా వైద్య సేవలను నిలిపి వేయనున్నట్టు వైద్యులు తెలిపారు.

నామమాత్రంగా శిబిరాలు



స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. కనీసం పీహెచ్‌సీ వైద్యులు కూడా లేకుండానే శిబిరాలను నిర్వహించడం హాస్యాస్పదంగా ఉంది. గత జగన్‌సర్కారులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో సాధారణ వైద్యులతో పాటు ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, కంటి, కార్డియాలజీ, చిన్నపిల్లల వైద్యులు, తదితర ప్రత్యేక వైద్యులను కూడా అందుబాటులో ఉండి, వైద్య సేవలు అందించారు.

– బొద్దు ఆశిష్ కుమార్, ఎల్బీచర్ల

క్లుప్తంగా

రమ్యశ్రీకి కలెక్టర్ అభినందన



రమ్యశ్రీని అభినందిస్తున్న కలెక్టర్ నాగరాణి

పెనుమంట్ర: ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీ ఫలితాల్లో టీజీటీ ఇంగ్లీష్ విభాగంలో రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ మీడియం జిల్లా స్థాయిలో ద్వితీయ ర్యాంకు, పీజీటీ ఇంగ్లీష్ విభాగంలో జోన్–2లో నాలుగో ర్యాంకు సాధించిన పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన వెలగల రమ్యశ్రీని సోమవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. రమ్యశ్రీ సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌ను కలిశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సంయుక్తంగా అవార్డుతో సత్కరించి అభినందించారు.

ఎమ్మెల్సీ వంకకు కృతజ్ఞతలు


ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌ను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ ఆచంట నాయకులు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో ఇసుక మాఫియాపై శాసన మండలిలో ప్రశ్నించిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌ను వైఎస్సార్‌సీపీ ఆచంట నియోజకవర్గ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరిలో సుంకర సీతారామ్, కర్రి వేణుబాబు, కోట వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటి, తప్పెట్ల వెంకట్రావు, దొమ్మేటి రాంబాబు, ముత్యాల నాగేశ్వరరావు, ఆర్ రంగారావు, పెచ్చెట్టి సత్యనారాయణ, బొంతు శ్రీను, గుబ్బల రామకృష్ణ, కోట గిరిధర్‌లు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యంతో కుటుంబం బలోపేతం

పాలకొల్లు సెంట్రల్: ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాదిని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పాలకొల్లు అధికారి ఎం ఉమ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద సోమవారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ స్టాల్ ఏర్పాటు చేశారు. ఉమ మాట్లాడుతూ స్థూలకాయ నివారణకు చెక్కర, నూనె వినియోగం తగ్గించాలన్నారు. శిశు, చిన్నపిల్లల ఆహారపు అలవాట్లలో మార్పు తీసుకురావాలని సూచించారు. పిల్లలతో జంక్ ఫుడ్, శీతల పానీయాలు మాన్పించాలన్నారు. పోషణ సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: టీబీ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని మండల ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు అన్నారు. సోమవారం మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అల్లూరి సీతారామరాజు జూనియర్ కళాశాలలో టీబీ యూనిట్ ద్వారా విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్లు జి.ఉదయ్ చందర్, ఎస్‌టీఎస్‌కే సత్తిబాబు, కళాశాల చైర్మన్ పి.రామసూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ వర్కర్లకు వైద్య పరీక్షలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మునిసిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. సోమవారం టౌన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్యులు పబ్లిక్ హెల్త్ వర్కర్లు సుమారు 120 మంది వర్కర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ వర్కర్లు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ ఎం క్రాంతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌కుమార్, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చిన్నకూరగాయల మార్కెట్ వద్ద ఉన్న అటుకుల మండపం రామాలయం వద్ద ఉన్న విద్యుత్ పోల్‌పై సోమవారం రాత్రి అకస్మికంగా మంటలు రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ వైర్లు తెగిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపు చేశారు. గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

వరల్డ్ హార్ట్ డే ర్యాలీ

పాలకొల్లు సెంట్రల్: గుండె జబ్బుల కారణంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని డాక్టర్ వై.హృదయమోహన్ అన్నారు. సోమవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మెడ్ యునైటెడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ నుంచి పూలపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అహ్మద్ నైముద్దీన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ పునఃప్రతిష్ఠా మహోత్సవం


హోమం నిర్వహిస్తున్న భక్తులు

నరసాపురం రూరల్: మొగల్తూరు గ్రామదేవత నడివీధి ముత్యాలమ్మ వారి పునఃప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈనెల 8న అమ్మవారి పూరిపాక, ఘటాలు దగ్ధమైన విషయం విధితమే. దీంతో గ్రామంలోని అన్ని నివాస ప్రాంతాల్లో ఆదివారం శుద్ధి చేసే కార్యక్రమాలు నిర్వహించారు. రెండో రోజు సోమవారం ఉదయం 5 నుంచి గణపతి పూజతో పుణ్యాహవచనం, వాస్తు పూజా, వాస్తు హోమంతో పాటు ముత్యాలమ్మకు ప్రధాన ప్రాయచిత్త హోమాలు చేశారు. అమ్మవారి నిట్రాడ నిలబెట్టిన అనంతరం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ ఆడపడుచులు, బంధుమిత్రులు, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఆర్డీఓ దాసి రాజు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు పీడీ రాజు, ఉంగరాల రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో ఇసుక దోచేశారు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేకపోయినా ఇష్టారాజ్యంగా కూటమి నాయకులు తవ్వేసి దోచేసుకున్నారని వైఎస్సార్‌సీపీ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. సోమవారం తూర్పుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన గ్రామ కమిటీలు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇసుకలో నియోజకవర్గంలో ఎటువంటి అవినీతి జరగకపోయినా, ర్యాంపు నుంచి వెళుతున్న లారీల ఫొటోలు తీసి అవహేళనగా మాట్లాడుతూ కుంభకోణం జరిగినట్లు మభ్యపెట్టడానికి ప్రయత్నించారని గుర్తుచేశారు. నేడు గ్రామగ్రామాన గుట్టలు వేసి మరీ ఇసుకను దారుణంగా అమ్ముతున్నారని శ్రీరంగనాథరాజు ఆరోపించారు. గుమ్ములూరు, ఆచంట వేమవరం గ్రామాల్లో నక్కల కాలువ గట్టులు తవ్వేసి మట్టిని లే అవుట్లకు తరలించుకొన్నారని తెలిపారు ఇసుక, మట్టి అవినీతిని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

మార్టేరు సెంటర్‌లో అధునాతనంగా బస్‌షెడ్ నిర్మించానికి కృషి చేస్తే, నేడు అధికార పార్టీ కూటమి ప్రభుత్వం పెద్దల ఫొటోలు వేసుకొని గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటని అన్నారు. సులభ్ కాంప్లెక్స్ ఎంతో సుందరంగా తీర్చిదిద్ది రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నిర్మించామని వివరించారు. ఆచంటలో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను 16 నెలలు కావస్తున్నా ప్రారంభించలేదన్నారు. తూర్పుపాలెంలో క్యాంపు కార్యాలయం నిర్మిస్తుంటే పూర్తి అనుమతులు ఉన్నాయా అంటూ ఎన్నో అడ్డంకులు పెట్టడానికి ప్రయత్నించారని తెలిపారు. ఇప్పుడు సొంతంగా నిర్వహిస్తున్న రైసుమిల్లులకు ఒక్క గింజ ధాన్యానికి అనుమతులు లేకుండా కూటమి ప్రభుత్వం నాయకులు చేశారన్నారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా తనను ఏమీ చేయలేరని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తా చూపుతుందన్నారు. నియోజకవర్గంలోనూ తమ సత్తా చూపుతామన్నారు. డిజిటల్ బుక్ రాష్ట్రంలో 2029 నుంచి అమలులోకి వస్తున్నా, నియోజకవర్గంలో రేపటి నుంచే అమలులోకి వస్తుందని తెలిపారు. ఎక్కడైనా కార్యకర్తకు అన్యాయం జరిగితే, వెంటనే అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా కష్ట కాలంలో అండగా నిలుస్తున్న జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ, పోతుమూడి రామచంద్రరావు, గుబ్బల వీరబ్రహ్మం, గుడాల చంటి, పడాల అబ్బు, దంపనబోయిన బాబూరావు, అంబటిసుధాకర్, ఈది ప్రవీణ్, పులిదిండి వెంకటేశ్వర్లు, చిటికెన బాబీ, కొవ్వూరి వేణుమాధవ్ రెడ్డి, చింతపల్లి గురుప్రసాద్, దొంగ దుర్గా ప్రసాద్, పలివెల శ్రీను, శ్రీనివాసరావు, కుడిపూడి సుబ్రహ్మణ్యం, కుసుమే రాంబాబు, మేడిచర్ల పండు, మట్టా ఆనంద్‌కుమార్, , పెనుమత్స విశ్వనాథరాజు, బోసు పాముల శ్రీను, కందికట్ల మోహనరావులు పాల్గొన్నారు.


తూర్పుపాలెంలో నూతన గ్రామ కమిటీలను అభినందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

సూపర్ జీఎస్టీతో మేలు

పెనుగొండ: సూపర్ జీఎస్టీతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఆచంట ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ అన్నారు. సోమవారం ఆచంటలో సూపర్ జీఎస్టీపై ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు. నిత్యవసరాలు, మందులు, ఫ్యాన్సీ, ఇతర వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్ జి.ఉషాసత్యదేవి, ఏఓ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 36 ఫిర్యాదులు


సమస్యలు వింటున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 36 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ అర్జీలను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆర్డీఓ తెలిపారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యాంత్రీకరణ లాభదాయకం


కాంభొట్లపాలెంలో డ్రోన్‌తో పిచికారీ

యలమంచిలి: ప్రకృతి వ్యవసాయ సాగులో యాంత్రీకరణ వల్ల మరింత లాభం పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి జి.జ్యోతి అన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కాంభొట్లపాలెం గ్రామంలో డ్రోన్‌లో సేంద్రియ ఎరువులు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు వరి పొలాల్లో పొడ, ముడత తెగులు నివారణకు ట్రై కో డెర్మవిరిడీ, ఇస్పారియా, వెట్టి సెలియం కలిపి డ్రోన్‌తో పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జడ్డు లక్ష్మీనారాయణ, బండి లక్ష్మీ దుర్గ, రైతులు పాల్గొన్నారు.

సరస్వతీ నమోస్తుతే


పెనుగొండ : మరకత శిల వాసవీ మాత


పెనుగొండ : వాసవీ మాత


పాలకొల్లు సెంట్రల్: ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో..


పెనుమంట్ర : ఆలమూరు పీఠంలో అమ్మవారు


పెనుగొండ : వాసవీ మాతకు నృత్యార్చన

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. సరస్వతి పూజలు, విద్యాభ్యాసాలు నిర్వహించారు. పండ్ల మార్కెట్ వద్ద అమ్మవారు గౌరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 108 మంది మహిళలచే కుంకుమ పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణ, గునిశెట్టి శ్రీనివాస్, చిట్టూరి కృష్ణ, మండెల కృష్ణస్వామినాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గడ్డిబజార్ కనకదుర్గ ఆలయంలో పూజలు చేశారు. రాయిపేట దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ చేశారు.

సరస్వతీ అలంకరణలో అమ్మవార్లు

పెనుగొండ: స్థానిక నగరేశ్వర మహిషాసురమర్దని వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దని, వాసవీ మాతలు సరస్వతీ దేవి అలంకరణలో పూజలు అందుకున్నారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ థాంలోనూ మరకత శిల వాసవీ మాతను సరస్వతీ దేవిగా అలంకరించారు. పెనుగొండ, వడలి, సిద్ధాంతం, పెదమల్లం గ్రామాల్లో నిర్వహించిన సరస్వతీ పూజలకు విద్యార్థులు బారులు తీరారు. పెనుగొండ నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి, వాసవీ శాంతి థాం, కంచి కామాక్షి ఆలయాల్లో సరస్వతీ పూజలు చేశారు. విద్యార్థులకు పెన్‌లను బహూకరించారు. వాసవీ శాంతి థాంలో నరసాపురంలోని నటరాణి కూచిపూడి డాన్స్ అకాడమికి చెందిన 20 మంది చిన్నారులు వాసవీమాతకు నృత్యార్చన చేశారు. కూచిపూడి నృత్యం ఆకట్టుకొంది.


యలమంచిలి : మేడపాడు కాలనీలో..

సరస్వతి నమస్తుభ్యం

యలమంచిలి: యలమంచిలి గ్రామ దేవత పుంతల ముసలమ్మ ఆలయం వద్ద నిర్వహించిన సరస్వతి పూజలో 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మేడపాడు కాలనీ వారాహి అమ్మవారి విగ్రహం వద్ద వికాస్, అంజలి దంపతులు పూజ చేశారు. పూజలు చేసిన పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో..

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరణ చేశారు. స్వామివారికి అభిషేకాలు, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం సప్త సోమవార ప్రదక్షిణల్లో భాగంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని పంచహారతుల కార్యక్రమం వీక్షించారు. రాత్రి ఆలయంలో సరస్వతి దేవిని భక్తులు దర్శించుకున్నారు. చినగోపురం వీధిలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరణ చేశారు. కన్నె పిల్లలచే అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు చేయించారు. 102 మంది మహిళలచే వాసవి కన్యకాపరమేశ్వరి శతగోక్షీర కలశాభిషేకాఉలు చేశారు. యడ్లబజారు సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. వివిధ కూడళ్లలో మండపాల వద్ద విద్యార్థులు సరస్వతీ దేవికి పూజలు నిర్వహించారు.


పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో..

చదువుల తల్లికి పూజలు

పెనుమంట్ర: మార్టేరులోని కనకదుర్గమ్మ, పోలేరమ్మ, మావుళ్లమ్మ, కంచి కామాక్షమ్మ వార్లు సరస్వతి దేవిగా పూజలు అందున్నారు. ఆలమూరులోని మెయిన్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమ వద్ద సోమవారం రాత్రి మహిళలు పిల్లలు ప్రత్యేక పూజలు చేశారు. నెగ్గపూడిలోని కనకదుర్గమ్మ, వణువులమ్మ వాళ్లను సరస్వతి దేవిగా అలంకరించారు. జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, వేణుబాబు దంపతులు విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.


నరసాపురం : స్టీమర్ రోడ్డులో కుంకుమ పూజలు


యలమంచిలి : సరస్వతి పూజలో పాల్గొన్న భక్తులు


పాలకొల్లు సెంట్రల్: మండపంలో సరస్వతిదేవికి పూజలు

దుర్భరంగా చేనేత కార్మికుల పరిస్థితి


కరపత్రాలు పంచుతున్న సంఘ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న చేనేత వ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో చేనేత కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందని చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అక్కింశెట్టి కోట నాగయ్య అన్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో అక్టోబర్ 6, 7 తేదీల్లో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం పాలకొల్లులో కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా కోట నాగయ్య మాట్లాడుతూ ప్రతి చేనేత కార్మికునికీ నేతన్న నేస్తం అమలు చేయాలని, చేనేత రంగ పరిరక్షణకు 11 రకాల రిజర్వేషన్లు అమలుతోపాటు వాటిని ఉల్లంఘించిన పవర్‌లూమ్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు కాసా కోటేశ్వరరావు, వాసా రామలింగం, నిల్లా మహాదేవ్, తమ్మ ఏకాంబరం, నిల్లా దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేడపాడులో బతుకమ్మ పండుగ


బతుకమ్మలతో యువతులు, మహిళలు

యలమంచిలి: దసరా ఉత్సవాల్లో తెలంగాణకు ప్రత్యేకమైన బతుకమ్మ పండుగను సోమవారం మేడపాడులో కోలాహలంగా నిర్వహించారు. యువతులు, మహిళలు పట్టు వస్త్రాలు ధరించి పూలతో తయారుచేసిన బతుకమ్మలను తలపై పెట్టుకుని గ్రామంలో ఊరేగారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద కనకదుర్గమ్మ విగ్రహం నుంచి శివాలయం వీధి, గ్రామ దేవతలు వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల ఆలయం మీదుగా ముద్దల వారి వీధి, కాలనీ మీదుగా సుమారు మూడు కిలోమీటర్ల మేర ఊరేగింపు నిర్వహించారు. తిరిగి వైఎస్సార్ సర్కిల్ వద్ద బతుకమ్మలను ఊయలలో ఉంచి పాటలు పాడుతూ సందడి చేశారు. కార్యక్రమాన్ని దసరా ఉత్సవ కమిటీ సభ్యులు అడబాల రామ్మోహనరావు, దేవళ్ల గోపాలకృష్ణ, కొడవటి వాసు, వల్లభు గణేష్, డేగల సూర్యప్రభ, అడబాల స్వప్న, మేకా కీర్తి, అరవ కీర్తి, కొడవటి హేమలత, కొడవటి భారతి, గంధం సింధు పర్యవేక్షించారు.